తాగు నీరు వృథా



కంది శివారులో పైప్‌లైన్ లీకేజీతో వృథాగా పోతున్న మంజీరా నీరు

ఎండ దంచికొడుతుంది.. దాహార్తిని తీర్చుకునేందుకు ప్రజలు నానా అగచాట్లు పడుతున్నారు. ఈ సమయంలో మంజీరా ఫైప్ లైన్‌కు లీకేజీలు ఏర్పడి తాగు నీరు నేలపాలవుతుంది. సంగారెడ్డి మండలం కల్పగూరు వద్ద ఈ దృశ్యం కనిపించింది. కాగా, ఫైప్ లైన్.. పలు చోట్ల పాడైపోయి లీకేజీలు ఏర్పడమే కారణం. ఇప్పటికైనా మంజీరా వాటర్ వర్క్స్ అధికారులు స్పందించి తక్షణమే ఫైప్ లైన్‌కు మరమ్మతులు చేపట్టాలని, నీటి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ ఫైపు లైన్ 50 ఏళ్ల క్రితం ఏర్పాటు చేశారని చెబుతున్నారు.

– కంది(సంగారెడ్డి):

మురుగు.. పరుగు



జాతీయ రహదారిపై మురుగు నీరు

జాతీయ రహదారిపై నిత్యం మురుగు నీరు చేరుతుంది. వర్షపు నీటి పారుదలకు రోడ్డుకు ఇరువైపులా కాలువలను నిర్మించారు. ప్రస్తుతం ఇందులో డ్రైనేజీ నీరు ప్రవహిస్తుంది. ఆ రహదారిని ఆనుకుని ఉన్న భవనాలకు చెందిన డ్రైనేజీ నీటిని ఈ కాలువలో వదులుతున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ మురుగు రోడ్డుపై పారుతుండటంతో వాహనదారులు నరకయాతన పడుతున్నారు. పైగా ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

– రామచంద్రాపురం(పటాన్‌చెరు)

క్లుప్తంగా

బీరప్ప స్వామికి ప్రత్యేక పూజలు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలపరిధిలోని హుమ్నాపూర్ గ్రామశివారులో బీరప్ప స్వామి జాతర ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఆరో రోజైన మంగళవారం ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, పాలు పొంగించటం, సల్లలు చేయడం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఉత్సవాలకు పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ముందస్తు ఏర్పాట్లు చేశారు.

వ్యక్తి అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... కర్ణాటక రాష్ట్రం.. బీదర్‌కు చెందిన షఫీపాష బతుకుదెరువు కోసం సంవత్సరం క్రితం వచ్చి పటాన్‌చెరులోని గౌతంనగర్‌లో నివాసముంటున్నాడు. అరటి పండ్ల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈనెల 11న సాయంత్రం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన అతను ఎంతకీ తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు షఫీ కోసం తెలిసిన వారి వద్ద స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం తమ్ముడి అదృశ్యంపై అన్న ఖలీంపాష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడ్డ మహిళ మృతి



మహిళ మృతదేహం

పటాన్‌చెరు టౌన్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన గుర్తుతెలియని మహిళ చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రాజేష్ నాయక్ కథనం ప్రకారం... పటాన్‌చెరులోని సాకి చెరువు సమీపంలో మార్కెట్ కమాన్ వద్ద గుర్తుతెలియని మహిళ.. ఈ నెల 11న రోడ్డు దాటుతుండగా ప్యాసింజర్ ఆటో ఢీ కొట్టింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలైన ఆమెను చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున 3 గంటలకు మృతిచెందింది. ఆమె వయసు 40 నుంచి 45 మధ్య ఉండొచ్చని తెలిసింది. ఎవరికైనా ఆమె వివరాలు తెలిసి ఉంటే పోలీస్‌స్టేషన్‌లో తెలపాలని ఎస్‌ఐ విజ్ఞప్తి చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బకాయిలు చెల్లించాలి

కంది(సంగారెడ్డి): ఉపాధి కూలీలకు బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని సీపీఐ మండల కార్యదర్శి ఎంఏ ఖాజా మంగళవారం డిమాండ్ చేశారు. నాలుగు వారాలుగా కూలీలకు డబ్బులు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. వాటి కోసం ఎంపీడీఓ కార్యాలయం, పోస్ట్ ఆఫీస్‌లతోపాటు బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వస్తుందన్నారు. గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలకు పని ప్రదేశాల్లో నీడ, తాగు నీరు వంటి సౌకర్యాలను కల్పించాలన్నారు. కూలీలకు అన్ని గ్రామాల్లో పనులు కల్పించి బకాయి వేతనాలు చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

విద్యాభివృద్ధికి కృషి



విద్యార్థులను సన్మానిస్తున్న మాజీ ఎంపీపీ రాంరెడ్డి

మునిపల్లి(అందోల్): విద్యాభివృద్ధికి ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కృషి చేస్తున్నారని మాజీ ఎంపీపీ రాంరెడ్డి కొనియాడారు. మండలంలోని పలు పాఠశాలల్లో టెన్త్‌లో అత్యధిక మార్కులు పొందిన 8 మంది విద్యార్థులకు తాటిపల్లికి చెందిన మాజీ ఎంపీటీసీ గొల్ల కనకయ్య పేరిట ఆయన కుమారుడు పాండు బహుమతులను మంగళవారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం రాజనర్సింహ ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. మాజీ జెడ్పీటీసీ పెంటయ్య, సర్పంచ్ అంజిరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వెంకట లక్ష్మారెడ్డి, మారుతి, మైపాల్, ఏసయ్య పాల్గొన్నారు.

ఆరోగ్యానికి చెరకు రసం

వేసవి తాపం నుంచి ఉపశమనం పొందటానికి సహజ సిద్ధమైన పానీయాలు తాగేందుకు జనం ఆసక్తిని కనబరుస్తున్నారు. అలాంటి వీటిలో చెరకు రసానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. గతంలో ఎక్కడో ఒక చోట మాత్రమే లభించేది. ప్రస్తుతం పట్టణాల్లోని గల్లీ గల్లీలో అందుబాటులోకి వచ్చింది. దీనిపై ఉత్తరప్రదేశ్ యువత ఉపాధి పొందుతున్నారు. ఆరోగ్యంగా ఉండటంతో పౌష్టిక విలువలతో ఉండటంతో తాగేందుకు ఉత్సాహం చూపుతున్నారు.

- వేసవి తాపం నుంచి ఉపశమనం
- శరీర బరువు తగ్గేందుకు దోహదం
- గల్లీగల్లీలో మొబైల్ బండ్లపై విక్రయాలు
- ఉపాధి పొందుతున్న ఉత్తరప్రదేశ్ యువత



మొబైల్ చెరకు రసం వాహనం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ఎండలు మండిపోతున్నాయి. బహిరంగ మార్కెట్లో చాలా పానీయాలు అందుబాటులో ఉన్నప్పటికీ చాలా మంది ప్రకృతి సిద్ధంగా లభించే చెరకు రసాన్ని తాగేందుకే మొగ్గు చూపుతున్నారు. ఎన్నో విటమిన్లు కలిగిన ఈ రసాన్ని తాగడానికి ఎక్కువ మంది ఇష్టపడుతున్నారు.

అమ్మకాలు

ఉత్తరప్రదేశ్ రాష్టానికి చెందిన పలు కుటుంబాలు జిల్లాలోని సదాశివపేట, సంగారెడ్డి, పటాన్‌చెరు, జహీరాబాద్, జోగిపేట ప్రాంతాలకు వలస వచ్చారు. సీజన్‌కు తగిన విధంగా వ్యాపారాలు నిర్వహిస్తూ జీవిస్తున్నారు. ప్రత్యేకంగా మొబైల్ చెరకు రసం బండ్లను తయారు చేసి పట్టణాల్లోని కాలనీల్లో తిరుగుతున్నారు. ఇళ్ల ఎదుటకే వాహనాలను తీసుకొచ్చి తాజా రసాన్ని తయారు చేసి ఇస్తున్నారు. దీంతో తల్లిదండ్రులు వారి పిల్లలకు రోజు ఒక గ్లాస్ చొప్పున తాగిస్తున్నారు. గ్లాస్ జ్యూస్ ధర పది, ఇరవై రూపాయల వరకు విక్రయిస్తున్నారు.

ఉపయోగాలు బోలెడు

చెరకు రసం శరీర వేడిని తగ్గించి తక్షణ శక్తిని ఇస్తుంది. రక్తాన్ని శుద్ధి చేయడంతో పాటుగా జీర్ణక్రియను వేగవంతం చేస్తుంది. మూత్రపిండాల్లో రాళ్లను తొలగిస్తుంది. రసంలో క్రోమియం, మెగ్నీషియం, జింక్ వంటివి అధికంగా ఉంటాయి. శరీరంలో గ్లూకోజ్ లెవల్స్‌ను క్రమబద్ధీకరించడంతోపాటుగా కామెర్లు, ఇన్ఫెక్షన్లు రానివ్వదు. అలసటను తగ్గించి ఆయాసాన్ని దూరం చేస్తుంది. పిల్లల్లో తరుచుగా వచ్చే చిన్నపాటి ఆరోగ్య సమస్యలను నివారించవచ్చు. రోజూ తాగితే శరీర బరువు క్రమేపి తగ్గుతుంది. అందులో ఉండే కాల్షియం ఎముకలు, కండరాలకు శక్తిని ఇస్తుంది.

ఔషధంలా పని చేస్తుంది



వేసవిలో ప్రజలకు చెరుకు రసం దివ్య ఔషధంలా పని చేస్తుంది. అందులో ఉండే కాల్షియం ఉన్న కారణంగా ఎముకలు, దంతాల ఆరోగ్యానికి మేలు చేస్తుంది. చిన్నారులకు చాలా మంచిది. పైగా వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. కాలేయాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. రొమ్ము క్యాన్సర్ బారిన పడకుండా కాపాడే ఔషధ గుణాలున్నాయి.

: డాక్టర్ ప్రవీణ్ కుమార్, మండల వైద్యాధికారి

నర్సుల సేవలు భేష్

ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి

నారాయణఖేడ్: నర్సుల సేవలు అమోఘమని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి కొనియాడారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం నారాయణఖేడ్ ఏరియా ఆస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. వైద్యశాలకు రోగులు అనేక అనారోగ్య సమస్యలతో వస్తారన్నారు. అలాంటి సమయంలో నర్సులు అందించే సేవలు గొప్పవన్నారు. ఎన్ని జన్మలెత్తినా వారు అందజేసిన సేవలకు రుణం తీర్చుకోలేరన్నారు. ఇదే స్ఫూర్తితో రోగులకు మెరుగైన సేవలు అందజేయాలని కోరారు. ఎమ్మెల్యే సంజీవరెడ్డి జన్మదినం కావడంతో కేక్ కట్ చేయించి సిబ్బంది జ్ఞాపికను బహూకరించారు. కార్యక్రమంలో వైద్యశాల సూపరింటెండెంట్ వెంకట లక్ష్మి, సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్, పండరిరెడ్డి, శంకర్ ముదిరాజ్, వైద్యులు, నర్సులు పాల్గొన్నారు.

17న పట్టభద్రుల దినోత్సవం

పటాన్‌చెరు: కౌటిల్యా స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ (కేఎస్పీపీ) ద్వితీయ పట్టభద్రుల దినోత్సవాన్ని శుక్రవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం కిన్నెర సెమినార్ హాల్ లో నిర్వహించనున్నారు. ముఖ్య అతిథిగా జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ జస్టిస్ అరుణ్ కుమార్ మిశ్రా హాజరు కానున్నారు. పబ్లిక్ పాలసీ స్నాతకోత్తర (పీజీ) డిగ్రీని పూర్తి చేసిన 25 మందికి పట్టాలను ప్రదానం చేయనున్నారు. గీతం వర్సిటీ అధ్యక్షుడు ఎం.శ్రీభరత్, కేఎస్పీపీ సహ వ్యవస్థాపకుడు ప్రతీక్ కన్వాల్, వీరందర్ సింగ్ చౌహాన్, ఉపకులపతి దయానంద, గీతం అదనపు ప్రొఫెసర్ డీఎస్.రావు, కేఎస్పీపీ డీన్ సయ్యద్ అక్బరుద్దీన్, రిజిస్ట్రార్ గుణశేఖరన్ తదితరులు కార్యక్రమంలో పాల్గొంటారు.

ఆలయ వార్షికోత్సవాలు షురూ

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని రంజోల్‌లో గల దత్తాత్రేయ ఆలయ ప్రథమ వార్షికోత్సవ ఉత్సవాలు ప్రారంభం అయ్యాయి. మూడు రోజుల పాటు కొనసాగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం గణపతి పూజ, గౌరిపూజ, నవగ్రహారాధన, దత్తాత్రేయ స్వామి కలశ స్థాపన, స్వామి వారికి అభిషేకం, రుద్రహోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన వితరణ గావించారు. బుధవారం స్వామికి అభిషేకం, దత్తహోమం, పూర్ణాహుతి, విశేష హారతి ఉంటుందన్నారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం పల్లకీ సేవ ఊరేగింపు ఉంటుందని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సభ్యులు కోరారు.

గెలుపోటములపై అంచనాలు



- క్రాస్ ఓటింగ్‌పై ఆయా పార్టీ శ్రేణుల చర్చ
- రాజకీయాలకు తాత్కాలిక విరామం
- కుటుంబసభ్యులతో విహార యాత్రలకు ప్రాధాన్యం



రామచంద్రాపురం(పటాన్‌చెరు): లోక్‌సభ ఎన్నికల సందర్భంగా మొన్నటి వరకు ప్రచారాన్ని హోరెత్తించారు అభ్యర్థులు, రాజకీయ పార్టీల నేతలు. సోమవారం పోలింగ్ తంతు పూర్తి కావడంతో ఇక గెలుపోటములపై అంచనాలు వేసుకుంటున్నారు. వివిధ పార్టీల నేతలు, కార్యకర్తలు వేర్వేరుగా సమావేశమయ్యారు. అందులో తమ పార్టీ గెలుస్తుందంటే తమదంటూ చర్చించుకున్నట్లు సమాచారం. అందులో ఎక్కడెక్కడ క్రాస్ ఓటింగ్ జరిగిందో.. చర్చించారని తెలిసింది. మరికొంత మంది నేతలు ఎవరూ ఊహించని విధంగా ఫలితాలొస్తాయని చెబుతున్నారు. పైగా పోలింగ్ కేంద్రాల వారీగా ఓటింగ్ శాతంపై ఆరా తీస్తున్నారు. ఇదొక ఎత్తయితే ఇన్ని రోజులు సర్వశక్తులు ఒడ్డి ప్రచారంలో మునిగి తేలిన నేతలు ఫలితాలు వచ్చే లోపు కుటుంబ సభ్యులతో కలిసి సరదాగా గడిపేందుకు దేశ, విదేశీ యాత్రలకు సిద్ధమవుతున్నారు. రాజకీయ వాతావరణం నుంచి బయటపడేందుకు ఆహ్లాదానికి ప్రాధాన్యమిస్తున్నట్లుగా తెలుస్తోంది.

నిర్వహణ నాస్తి

పల్లె ప్రకృతి వనాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. మొక్కలకు నీరు పోయకపోవడంతో ఎండు ముఖం పడుతున్నాయి. ఇప్పటికే వనాల్లో పిచ్చి మొక్కలు మొలవగా పరిశుభ్రత పనులు సైతం చేపట్టడం లేదు. బాధ్యతల నిర్వహించాల్సిన అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతుంది.

- కళావిహీనంగా ప్రకృతి వనాలు
- ఎండుతున్న మొక్కలు.. మొలుస్తున్న పిచ్చిమొక్కలు
- పట్టించుకోని అధికారులు



వీరన్నగూడెంలోని ఒక్క మొక్కా లేని పల్లె ప్రకృతి వనం

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం, గుమ్మడిదల మండలాల్లోని అన్ని గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాలను అధికారులు ఆర్భాటంగా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఖాజీపల్లి, కొర్లకుంట, నల్తూర్, వావిలాల, మంగంపేట తదితర గ్రామాలతో పాటు గుమ్మడిదల మండలంలోని వీరన్నగూడెం, అనంతారం, కొత్తపల్లి, నల్లవల్లి, అన్నారం తదితర గ్రామాల్లోని పల్లె ప్రకృతి వనాలు కళా విహీనంగా మారాయి. ఎండా కాలం కావటంతో సరిపడా నీరు లేకపోవటంతో వనాల్లోని మొక్కలు ఎండిపోతున్నాయి. నీరు పోసేందుకు ఎవరూ ముందుకు రావటం లేదు. దీంతో మొక్కలు ఎండిపోయి, పిచ్చిమొక్కలు మొలుస్తున్నాయి. ప్రస్తుతం గ్రామాల్లో సర్పంచ్‌లు లేకపోవటంతో ప్రత్యేకాధికారులు పల్లె ప్రకృతి వనాలను మెరుగుపర్చటంలో పూర్తిగా విఫలమవుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ వనాలను కాపాడాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు ఎలాంటి చర్యలు తీసుకుంటున్న దాఖలాలు కనిపించటం లేదు. వాటికి పూర్వవైభవం తీసుకువచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నిర్వహణ సరిగా ఉండేలా చూస్తున్నాం
: ఉమాదేవి, ఎంపీడీఓ, గుమ్మడిదల

పల్లె ప్రకృతి వనాల నిర్వహణ ప్రస్తుతం బాగానే ఉంది. ఎప్పటికప్పుడు వనాలను సందర్శిస్తూనే ఉన్నాం. నిర్వహణకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రత్యేకాధికారులకు సూచనలిస్తున్నాం. మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకుంటున్నాం.

ఉపాధి పనికి రావాలి

మునిపల్లి(అందోల్): ఉపాధి పథకం జాబ్ కార్డు ఉన్న వారు పనికి రావాలని ఏపీఓ యాదగిరి మంగళవారం తెలిపారు. ప్రభుత్వం 3 వందల రూపాయల కూలి మంజూరు చేస్తుందన్నారు. ఉపాధి పథకంలో ఎంతమందికైనా పని కల్పిస్తామని తెలిపారు.

కారులో మంటలు

జహీరాబాద్: ఒక కారు ఇంజన్ నుంచి మంటలొచ్చాయి. ఈ సంఘటన పట్టణంలో చోటుచేసుకుంది. మంగళవారం మధ్యాహ్నం మొగుడంపల్లి మండలం వైపు నుంచి జహీరాబాద్ వైపు వెళుతున్న కారులో నుంచి పొగలు వచ్చాయి. వెంటనే రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద సర్వీసు రోడ్డులో వెహికల్ ఆపి డ్రైవర్ కిందకు దిగాడు. ఆతర్వాత మంటలు అంటుకుంటున్నాయి. ఇక్కడే ఉన్న ఒక వాటర్ ట్యాంకర్ సహాయంతో మంటలను అదుపులోకి తెచ్చారు. దీంతో పెనుప్రమాదం తప్పింది. కానీ కారు ఇంజన్ పాక్షికగా దెబ్బతింది. షార్ట్ సర్క్యూట్ వల్లే మంటలు అంటుకున్నట్లు స్థానికులు పేర్కొన్నారు.



కారులో చెలరేగిన మంటలు

భగీరథుడి అడుగుజాడల్లో నడవాలి



రామాయంపేటలో శివాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సగర సంఘం సభ్యులు



టేక్మాల్(మెదక్): వెంకటాపూర్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

రామాయంపేట(మెదక్): భగీరథ మహర్షి అడుగుజాడల్లో ప్రజలు నడవాలని సగర సంఘం జిల్లా అధ్యక్షుడు మర్కు దత్తు పేర్కొన్నారు. పట్టణంలో సగర సంఘం సభ్యులు మంగళవారం భగీరథ మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంఘం సభ్యులు పట్టణంలో ర్యాలీ నిర్వహించి, వివేకానంద, అంబేడ్కర్, శివాజీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరూ వీలైనంతమేర సమాజసేవకు పాటు పడాలని, విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం చిత్తారమ్మ ఆలయంలో పూజలు చేశారు. సంఘం రెండు బేడల అధ్యక్షులు నాగభూషణం, మర్కు భూమయ్య, కోశాధికారులు సురేశ్, రామారపు రమేశ్, ఇతర సభ్యులు పెద్ద సిద్ధరాంలు, మర్కు బాల్‌రాజ్, మల్లేశం, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపూర్‌లో..

టేక్మాల్(మెదక్): మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో మహర్షి భగీరథ మహారాజ్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ఉప్పర సంఘం ఆధ్వర్యంలో మహర్షి భగీరథ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఇందులో ఉప్పర సగర సంఘం అధ్యక్షుడు సాయిలు సగర, కార్యదర్శి నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయమైన కోరిక అడగడం తప్పా?

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : ఎన్నికల విధులు నిర్వర్తించిన ఉపాధ్యాయులపై లాఠీచార్జి చేయించిన అధికారులపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని టీచర్స్ స్టేట్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రాథోడ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నారాయణఖేడ్ నియోజకవర్గం ప్రాంతంలో ఎన్నికల విధులు నిర్వర్తించిన ఉపాధ్యాయులు ఎలక్షన్ కమిషన్ ఇచ్చిన జీఓ ప్రకారం తమకు రావాల్సిన భత్యం రాష్ట్ర వ్యాప్తంగా ఏకరీతిగా ఇవ్వాలని డిమాండ్ చేసినందుకు అక్కడి అధికారులు పోలీసులతో కొట్టించారని ఆరోపించారు. న్యాయమైన కోర్కెను అడగడం తప్పా? అని ప్రశ్నించారు. ఎన్నికల శిక్షణలో ఉపాధ్యాయులు విధుల పట్ల ఎంతో అంకితభావంతో పని చేస్తారని పొగిడిన వారే పోలీసులతో దాడి చేయించడం ఎంత వరకు సబబు అని అడిగారు. ఈ ఘటనను తాము ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వం, ఎన్నికల సంఘం వెంటనే స్పందించి లాఠీచార్జి ఘటన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఓటింగ్‌లో మహిళలదే పైచేయి

చేగుంట(తూప్రాన్): లోక్‌సభ ఎన్నికల్లో పురుషుల కన్నా మహిళా ఓటర్లు ఓటింగ్‌లో ముందున్నారు. సోమవారం మండలంలోని 38 పోలింగ్ బూత్‌ల్లో నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల్లో మహిళా ఓటర్లు ఓటింగ్‌లో పాల్గొని పురుషులకంటే ఎక్కువ ఓట్లు వేసి తమ సత్తా చూపించారు. 25,236 ఓట్లు పోలయ్యాయి. 12,818 ఓట్లు మహిళలు వేయగా, 12,418 ఓట్లను పురుషులు వేశారు. పురుషుల కంటే 400 మంది మహి ళా ఓటర్లు ఎక్కువగా ఓట్లు వేసి ప్రజాస్వామ్యంపై తమ నమ్మకాన్ని చాటుకున్నారని అధికారులు వారిని ప్రశంసించారు.

ఇంటర్ దరఖాస్తుల స్వీకరణ

జగదేవ్‌పూర్(గజ్వేల్): జగదేవ్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2024–25 విద్యాసంవత్సరంలో ఇంటర్ ప్రథమ సంవత్సర ప్రవేశ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బానో తు రాజన్న మంగళవారం తెలిపారు. ఈనెల 9 నుంచి 30వ తేదీ వరకు మొదటి దశ అడ్మిషన్లు కొనసాగుతాయని, అర్హత కలిగిన అధ్యాపకులతో విద్యాబోధన అందిస్తున్నట్లు చెప్పారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ కోర్సులున్నాయన్నారు. ఇంగ్లీష్, తెలుగు మీడియంలో విద్యాబోధన జరుగుతుందన్నారు.